మూతలు తెరిచి.. పనులు మరిచి

- సర్వీస్ రోడ్డు పక్కన నిలిచిన డ్రెయినేజీ పూడికతీత పనులు
- రెండు నెలలుగా తెరిచే ఉన్న మూతలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- త్వరితగతిన పూర్తిచేయాలని వేడుకోలు

మునగాల : మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డు పక్కన గల డ్రెయినేజీలో పూడికతీత పనుల నిమిత్తం జీఎమ్మార్ సిబ్బంది మూతలు తొలగించి పనులు మరిచారు. మూతలు తెరచి ఉంచడంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాకపోకలకు సైతం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలుగా ప్రమాదకరం.

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో 2013లో ఫ్లెటైవర్ బ్రిడ్జికి ఇరుపైపులా జీఎమ్మార్ సంస్థ డ్రెయినేజీలు నిర్మించింది. నాటి నుంచి నేటివరకు వాటిని శుభ్రం చేయకపోవడంతో చెత్తచెదారంతో అవి నిండిపోయి మురుగునీరు సర్వీసు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పలుమార్లు సాక్షి దినపత్రికలో డ్రెయినేజీల నిర్వహణ అస్తవ్యస్తం అనే శీర్షికతో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. అంతేకాకుండా స్థానిక సీఐ, గ్రామసర్పంచ్, పలువురు గ్రామపెద్దలు జోక్యం చేసుకొని జీఎమ్మార్ సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో స్పందించిన జీఎమ్మార్ సంస్థ సిబ్బంది మే నెల 25న డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించేందుకు మూతలను జేసీబీతో తొలగించారు. మరో మూడు రోజుల పాటు డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎత్తి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఆపై తొలగింపు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో కొన్ని ప్రాంతాలలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగానే ఉంది. డ్రెయినేజీలపై మూతలను కూడా వేయలేదు. నాటి నుంచి నేటి వరకు రెండు నెలలుగా మూతలు లేకపోవడంతో డ్రెయినేజీలు ప్రమాదకరంగా మారాయి. సుమారు 1.5కి.మీ మేర ఉన్న డ్రెయినేజీలపై అక్కడక్కడ మూతలు తీసీ వదలివేయడం వల్ల వ్యాపారస్తులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తక్షణమే యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు పూర్తిచేసి డ్రెయినేజీపై మూతలు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మునగాలలో సర్వీసు రోడ్డు వెంట మూతలు తెరవడంతో ప్రమాదకరంగా డ్రెయినేజీ

పూడికతీత పనులు పూర్తిచేయాలి

మునగాల గ్రామపంచాయతీ పరిధిలో సర్వీసు రోడ్డు వెంట నిర్మించిన డ్రెయినేజీలో పేరుకుపోయిన పూడికతీత పనులను జీఎమ్మార్ సంస్థ సిబ్బంది త్వరితగతిన పూర్తిచేయాలి. డ్రెయినేజీపై ఉన్న మూతలు తొలగించడంతో ప్రమాదకరంగా ఉంది. కావున పూర్తిస్థాయిలో చెత్తచెదారం తొలగించి యుద్ధప్రాతిపదికన మూతలు వేయాలి.

– చింతకాయల ఉపేందర్, సర్పంచ్, మునగాల

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కోదాడఅర్బన్ : శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీ మహాలక్ష్మి పిరమిడ్ ధ్యాన కేంద్రం అధ్యక్షుడు కాటేపల్లి నర్సింహారావు అన్నారు. ఆదివారం పట్టణంలో మాంసాహారం వద్దు.. శాకాహారం ముద్దు అంటూ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ ధ్యానులు, శాకాహారులు, పట్టణంలో శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, అదే విధంగా మాంసాహారం వల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ప్లకార్డులతో ప్రదర్శన చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. జీవ హింస వద్దు శాకాహారం ముద్దు, మానవులంతా ఆరోగ్యంగా ఉండాలంటే శాకాహారం తీసుకోవాలన్నారు. అదే విధంగా ధ్యానంతోనే మనసుకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బండారు రమేష్‌బాబు, చంద్రకాంత్, పి.సత్యనారాయణరెడ్డి, పయిడిమర్రి శ్రీనివాసరావు, జూపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి పిరమిడ్ ధ్యాన్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలి

చిలుకూరు : గ్రంథాలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని గ్రంథాలయ చైర్మన్ అంబాల వెంకటి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని బాపూజీ శాఖ గ్రంథాలయం భవనం నూతన నిర్మాణానికి చిలుకూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ గ్రంథాలయ అధికారి మల్లెపంగు వెంకటి రూ.10వేల నగదును చైర్మన్ వెంకటి, కార్యదర్శి పిల్లుట్ల కృష్ణయ్యకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సురేష్‌బాబు, రమేష్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న వెంకటి

క్లుప్తంగా

వయోవృద్ధుల సంఘం కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్ అసోసియేషన్ (వయోవృద్ధుల సంఘం) గ్రామ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి నరాల రుక్మారావు పాల్గొని గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోనాల మంగయ్య, ఉపాధ్యక్షుడిగా జక్కి వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా జెట్టి కోటిరెడ్డి,, సహాయ కార్యదర్శిగా బొంతు వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెడ్డిమల్ల భిక్షం, కోశాధికారిగా చెవుల వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా బండారు గుర్వయ్య, మోత్కూరి బ్రహ్మాచారి, కొర్రా సక్రు, కాలె సుందరయ్య, చిమట భూలక్ష్మిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఘనంగా మాసకల్యాణం



మాసకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దేవాలయంలో స్వామివార్ల విగ్రహాలను పూలతో, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అదే విధంగా స్వామివారికి విశేష అలంకరణ వంటి కార్యక్రమాలతో కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనాలు, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాలలో 1993–94లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా రూ.20వేల విలువగల ఇన్వర్టర్‌ను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు మాట్లాడుతూ.. పాఠశాలలో కంప్యూటర్, ప్రింటర్స్ తదితర పరికరాలు పనితీరుకు ఉపయోగపడే ఇన్వర్టర్‌ను పాఠశాల పూర్వ విద్యార్థులు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థి మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కర్నే నాగిరెడ్డి, తోకల వెంకటేశ్వర్లు, సట్టు లింగయ్య, వెంకటరమణ, విజయలక్ష్మి, అనిత, సరిత, నవ్య, గాయత్రి, లక్ష్మీనర్సమ్మ, నాగమణి, అమరవాణి తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గొర్రెలను పంపిణీ చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ నాయకుడు మామిడి రామారావు, ఆర్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ అనంతు సైదయ్య, అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని కొమరబండలో రెండో విడతలో లబ్ధిదారులకు మంజూరైన గొర్రెలను యాదవ కులస్తులను వారు పంపిణీ చేసి మాట్లాడారు. అన్ని కులాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే సీఎం కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు, బత్తుల కిట్టు, బాలినేని రామ్మూర్తి, చంద్రయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సీతారామలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుంది. దీంతో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం వైద్యులు శివప్రసాద్ అశ్వనిజయశ్రీ దంపతులు పంపిన రూ.10వేల ఆర్థికసాయాన్ని సామాజిక కార్యకర్త ఆకుల రాము ఆదివారం ఆమెకు అందజేశారు.

విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

మఠంపల్లి : తెలంగాణ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఇందులో భాగంగా అన్ని గురుకులాలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని బక్కమంతులగూడెం వద్ద గల కస్తూరిబా బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, టీచర్ల హాజరు, భోజన మెనూను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అదే విధంగా ఇటీవల పాఠశాలలో దాతలు, సిమెంట్ పరిశ్రమల సహకారంతో సుమారు రూ.25లక్షలతో చేపట్టిన పాఠశాల ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్‌ఎం విజయకుమారీ, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, సీతారామయ్య, కొండలు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

బేత సైదిరెడ్డి మృతి తీరనిలోటు

మండలంలోని చౌటపల్లికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు బేత సైదిరెడ్డి అకాల మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా సైదిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, వీరంరెడ్డి వెంకట్‌రెడ్డి, నలబోలు భవానీవెంకట్‌రెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, కడియం వెంకట్‌రెడ్డి, బేత కోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రోషిరెడ్డి, ప్రతాపరెడ్డి, కొండలు, ప్రదీప్, సత్యనారాయణరెడ్డి, తదితరులున్నారు.



మఠంపల్లి : కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చేరిన పలువురు వివిధ పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా జరగడంలేదని, తెలంగాణ అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మేలు చేకూరిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శంకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బసవయ్య, సురేష్, బాల వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేదపాఠశాల నిర్మాణానికి స్థలం ఇప్పించాలి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని మట్టపల్లి పుణ్యక్షేత్రంలో వేదపాఠశాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించాలని కోరుతూ ఆ పాఠశాల గురువులు సూరిశర్మ, పవన్‌కుమార్‌శర్మ ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేద పాఠశాల నిర్మాణం కోసం స్థలాన్ని ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గుండా బ్రహ్మారెడ్డి, సంపత్ కుమార్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ఎమ్మెల్యే సైదిరెడ్డితో మాట్లాడుతున్న వేదపాఠశాల గురువు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. 11రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు యాకుబ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా ఆ కార్మిక సంఘం నేతలను కనీసం చర్చలకు కూడా పిలువకపోవడం దురదృష్టకరంగా ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలను చెల్లించాలని, కేంద్రం తీసుకువచ్చిన నాలుగు చట్టాలను తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపగాని సత్యం, జానయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, గోపయ్య, గంగయ్య, మహేష్, లింగమ్మ తదితరులున్నారు.

జీఓ 51ను రద్దు చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : జీఓ నంబర్ 51ను రద్దు చేయాలని, కార్మికుడు మృతి చెందితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హాసన్ మియా డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఓ నంబర్ 60లో పేర్కొన్న వేతనాలను కేటగిరిల వారీగా పంచాయతీ సిబ్బందికి రూ.15,600 చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ఇతర స్కిల్ సిబ్బందికి రూ.19,500 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో పంచాయతీ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు కొండల్, రత్నం, యల్లమ్మ, ప్రసాద్, అంజయ్య, గోపయ్య, సత్తయ్య వెంకటరెడ్డి, వీరారెడ్డి, నవీన్, సత్యనారాయణ, శాంతమ్మ పాల్గొన్నారు.

మేళ్లచెరువు : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మండల కేంద్రంలో భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మిక చట్టాలు అమలుతో పాటు వారికి రూ.19వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 51జీఓను రద్దు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టిపు సైదులు, వెంకటేశ్వర్లు, సైదులు, మరియమ్మ, శ్రీనివాసరావు, జ్యోతిరాణి, సైదానాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

మఠంపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 11వ రోజు కొనసాగింది. ఈ సమ్మెలో పలువురు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, మంచినీటి సరఫరా తదితర పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, మైసయ్య, మోతీలాల్, మేడి దేవదానం, గురువారెడ్డి, దావీదు, వెంకటేశ్వర్లు, కిట్టయ్య, శ్రీను, వెంకటి, సంతోషం, కోటేశ్వరి, నాగలక్ష్మి, సైదా, వీరాస్వామి, నాగయ్య, బూరీ, బాలాజీ, తదితరులున్నారు.



నడిగూడెంలో భిక్షాటన చేస్తున్న గ్రామపంచాయతీ వర్కర్లు



గరిడేపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మికులు

గ్రామపంచాయతీ కార్మికుల భిక్షాటన

నడిగూడెం : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఆదివారం గ్రామపంచాయతీ వర్కర్లు మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ వర్కర్లు 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. వారు చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నారని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చిమట నాగరాజు, సుభాని, లచ్చయ్య, వెంకన్న, నాగభూషం, వెంకటమ్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్కావెంజర్లు లేక పాఠశాలలు అపరిశుభ్రతతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరలో స్కావెంజర్ల నియామకం చేపట్టాలని కోరారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి తక్షణమే 30శాతం ఇంటీరియర్ రిలీఫ్‌ను ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లకై ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలని, డీఏ బకాయిలు, పీఆర్సీ ఏరియర్స్‌ను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.నాగేశ్వరరావు, యతిపతిరావు, రూప్లానాయక్, చందూలాల్, సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అఖిలపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం

మఠంపల్లి : మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం సీపీఎం, కాంగ్రెస్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, టీజేఎస్, వైఎస్సార్‌టీపీ నాయకుల అఖిలపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సమావేశంలోని విషయాలను విలేకరులకు వెల్లడించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని 40లక్షల మందికి పోడు భూముల రైతులకు పట్టాలిస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పి నేటికీ అమలు చేయలేదన్నారు. దళిత, గిరిజనులకు మూడు ఎకరాలు భూమి ఇస్తామన్న హామీ అమలుకాలేదన్నారు. 9సంవత్సరాలు పదవీకాలం పూర్తయినా రూ.లక్ష రుణమాఫీ చేయలేదన్నారు. కొత్తరుణాలు ఇవ్వడంలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు, ఎమ్మెల్యేల ముట్టడి చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బానోతు బాబునాయక్, భూక్యా పాండునాయక్, సాదాసోత్ భిక్షంనాయక్, మాళోతు బాలునాయక్, చందర్‌రావు, రవి, రాము, కోటయ్య, వినోద్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవినాయక్

మహనీయుల చరిత్రలను తెలుసుకోవాలి

హుజూర్‌నగర్ : దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల చరిత్రలను తెలుసుకోవాలని కౌన్సిలర్ అస్మా నసీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధురాలు అరుణ ఆసఫ్‌అలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ ఆసఫ్‌అలీ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం అస్మా నసీర్ మాట్లాడారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ పాలకులకు చెమటలు పట్టించిన వీరోధాత్త నాయకురాలు, భారతరత్న అవార్డు గ్రహీత అరుణ ఆసఫ్ అలీ కొనియాడారు. కార్యక్రమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు ఖలేద్ అహ్మద్, మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు మన్సూర్‌అలీ, ప్రిన్సిపాల్ ఎండీ రెహానా, అడ్వకేట్ పాషా, రిజ్వాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిలుకూరు : మండల పరిధిలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 10ఏళ్ల క్రితం పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు కొల్లు సునీల్‌కుమార్, కరస్పాండెంట్ సత్యనారాయణ, డైరెక్టర్ శ్రీను, ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుద్దముక్కపై అమ్మవారి ప్రతిమ

కోదాడఅర్బన్ : పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు వెగ్గలం నరేష్‌చారి ఆదివారం బోనాల పండుగ సందర్భంగా అంగుళం సుద్దముక్కపై గ్రామ దేవత అమ్మవారి ప్రతిమను ఆవిష్కరించి తన కళాత్మకతను చాటుకున్నాడు. ఇప్పటికే చారి వివిధ దేవతలు, జాతీయ నాయకుల, సినీ కళాకారుల ప్రతిమలను సుద్దముక్కపై రూపొందించి తన కళాత్మకతను చాటుకున్నాడు.



అంగుళం సుద్దముక్కపై గ్రామదేవత ప్రతిమ

మున్నూరు కాపు సంఘం కమిటీ ఎన్నిక



సురేష్, అధ్యక్షుడు



గిరి, ప్రధాన కార్యదర్శి

మునగాల : మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక, వంగవీటి రంగా విగ్రహ ప్రతిష్ఠాపన, శ్మశానవాటిక పునరుద్ధరణ వంటి అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా తాటికొండ సురేష్, గౌరవ అధ్యక్షుడిగా కాసర్ల రంగన్న, గంధం అంజయ్య, గౌరవ సలహాదారులుగా పరమాత్ముల సత్యనారాయణ, కుందూరు నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి గోపి, గంధం సైదులు, ప్రధాన కార్యదర్శిగా శెట్టి గిరి, కోశాధికారిగా శాఖమూడి అప్పారావు, ప్రచార కార్యదర్శిగా తన్నీరు ఉపేందర్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసర్ల కోటేశ్వరరావు, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు నాయిని అంజిబాబు, కాసర్ల వెంకట్, రాజేష్, ప్రసాద్, సత్యం, నాగేశ్వరరావు, అప్పారావు, వెంకటేశ్వర్లు, రవి, ప్రసాద్, సందీప్, కుందూరు సీతారామయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నల్లగొండ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండవ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం చింతలపాలెంలో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేకల రామారావు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే మౌలాలి, ప్రధాన కార్యదర్శిగా పి.నరసింహారావు, కార్యదర్శిగా ఎ.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా ఆర్.వెంకటేశ్వర్లు, కె.నరసింహారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడిగా ఉమర్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా సమీర్‌ను ఎన్నికున్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చినకోటిరెడ్డి, నాగేశ్వరరావు, పుల్లయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

హుజూర్‌నగర్‌రూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ పథకం నిరుపేదలకు వరంలాంటిదని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వేపలసింగారంలో జడ ప్రభాకర్‌కు రూ.60వేలు, సాముల నాగమ్మకు రూ.22వేలు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నందిరెడ్డి చిన్నవీరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జర్విస్, ప్రసాద్ పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన రామనరసమ్మకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును గ్రామంలో ఆమె ఇంటి వద్ద బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్

కోదాడఅర్బన్ : పట్టణంలో ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 28మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. పేద ఆర్యవైశ్యులకు అసోసియేషన్ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని, వారి సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇరుకుళ్ల చెన్నకేశవరావు, స్థానిక నాయకులు వెంకటేశ్వరరావు, గోళ్ల చంద్రయ్య, రాజశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుర్రం మార్కెండేయ అన్నారు. ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం స్థానంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సహకారంతో రూ.30 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రంథాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ లలితాదేవి, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి గిరిబాబు, కార్యవర్గ సభ్యులు బషీర్, పుల్లారావు, నాగయ్య తదితరులున్నారు.